# బంధితులు

కాలింగ్ బెల్ అదేపనిగా, ఐదు నిమిషాలపాటు మోగుతూనే ఉంది.

గాఢనిద్రలో ఉన్న అనుపమకు ఆ కాలింగ్‌బెల్ మోగుతున్న చప్పుడు ఆమె కంటున్న కలలో వినిపిస్తున్నట్టుగా వినిపిస్తోంది.

కాస్సేపట్లోనే ఆమెకు ఆ చప్పుడు కలలో వినిపిస్తున్న చప్పుడు కాదనీ, బయట ఎవరో కాలింగ్‌బెల్ నొక్కుతున్నారని అర్థమైంది.

ఈరోజు అన్వేష్ ఓ గంట ముందుగానే వచ్చేసినట్టున్నాడు. అయినా కాలింగ్‌బెల్ ఎందుకు మోగిస్తున్నాడో. అతడు వెళ్ళేటప్పుడు బయటి డోర్ తాళపుచెవి తీసికెళ్ళలేదని, డోర్‌కు లాక్ చెయ్యకుండానే వెళ్ళిపోయాడని ఆమెకు గుర్తొచ్చింది.

ఆమె దిగ్గున లేచి బెడ్‌రూంలోంచి బయటకొచ్చింది.

కాలింగ్‌బెల్ ఇంకా మోగుతూనే ఉంది.

"వస్తున్నానండీ" అంటూ ఆమె ఆ ఇంటి మెయిన్ డోర్ దగ్గరకొచ్చి తలుపులు తెరిచింది.

"యేమిటంత మొద్దునిద్ర... ఐదు నిమిషాల నుండి కాలింగ్ బెల్ మోగిస్తూనే ఉన్నాను..." అన్నాడు అన్వేష్ విసుగ్గా ఇంట్లోకొచ్చి తలుపులు మూసేస్తూ.

"మీరు వెళ్ళేటప్పుడు కీ తీసికెళ్ళలేదు కదూ? డోర్‌కు లాక్ చెయ్యకుండానే వెళ్ళిపోయారు... యే దొంగోడన్నా..." అంది అనుపమ అతనితో పాటే వాళ్ళ బెడ్‌రూంలోకి నడుస్తూ.

"వెళ్ళే తొందర్లో మరచిపోయాన్లే... అందుకని ఐదు నిమిషాలసేపు నన్నీ ఈ భయంకరమైన చలిలో ఇంటిబయట నిల్చోబెడ్తావా?" అన్నాడు అన్వేష్ బట్టలు మార్చుకుంటూ.

"సారీ డియర్... బాగా నిద్రపట్టేసింది... ఆశ్చర్యం యేమిటంటే కాలింగ్‌బెల్ మోగుతున్న చప్పుడు నాకు వినిపిస్తూనే ఉంది... యేదో కల... ఆ కలలో ఈ కాలింగ్‌బెల్ మోగుతున్న చప్పుడు... అది కలకాదు... నిజంగానే బయట నువ్వు కాలింగ్ బెల్ మోగిస్తున్నావని అర్థం కావడానికి కొంచెం టైమ్ పట్టింది. సారీ డియర్... వెరీ వెరీ సారీ..." అందామె మత్తుగా అతనిమీదకు వొరిగిపోతూ...

"సారీలు గిరీలు యేమొద్దుగానీ నన్ను వదుకోనీయ్... చాలా అలసిపోయాను... స్టేట్స్ నుండి వాడెవడో పంపించిన అసైన్‌మెంట్‌ను పూర్తి

చేసేటప్పటికి నా తలప్రాణం తోకకొచ్చింది... ఫీలింగ్ టెర్రిబులీ టైర్డ్" అన్నాడతడు చకచకా బట్టలు మార్చుకొని పక్కమీదకు చేరిపోతూ.

"అవును... మీరీరోజు ఓ గంట ముందుగానే వచ్చేశారు గదా... అలసిపోవడమేమిటి?" అందామె అతని ప్రక్కనే పడుకొని, అతన్ని తనవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తూ...

"ఆ అసైన్‌మెంట్‌ను అర్థం చేసుకోవడానికి బుర్ర బద్దలు కొట్టుకోవలసి వచ్చింది. దీని సంగతి రేపు తేల్చుకుందాంలే అని కంప్యూటర్‌ని షట్ చేసి వచ్చేశాను" అన్నాడతడు తనమీదున్న ఆమె చేతుల్ని తీసేస్తూ...

"మంచిపని చేశారు... గంట ముందుగా వచ్చారు కాబట్టి ఈ రోజు మీకో బహుమతి..." అందామె అతని శరీరంతో తన శరీరాన్ని పెనవేస్తూ.

"ఇచ్చావుగా బహుమతి... ఐదు నిమిషాలు చలిలో నిల్చోబెట్టి... ఇప్పుడు నాకే బహుమతి అక్కర్లేదు.... బాగా నిద్దరొస్తోంది... నన్ను పడుకోనీయ్...." అన్నాడతడు ఆమె నుండి విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ.

"పడుకుందువులే డియర్.... నన్ను ఓ పది నిమిషాలిలా మీతో హాయిగా గడపనీయండి... లెటజ్ మేక్ లవ్ డియర్!" అందామె తన శరీరాన్ని అతని శరీరంతో ఐక్యం చేయడానికి ప్రయత్నిస్తూ...

"పది నిమిషాలా? లవ్ మేకింగా? ఈరోజు కుదరదు... నన్ను వదిలేయ్..." అన్నాడతడు విసుగ్గా.

"వదిలెయ్యడమా? నోవే!... ఈరోజు... ఈరోజు మిమ్మల్ని వదిలేసే ప్రసక్తేలేదు... వియ్ మస్ట్ మేక్ లవ్ టుడే..." అందామె అతన్ని తన గుండెలకు గాఢంగా హత్తుకుంటూ.

"సారీ అనూ... చాలా అలసిపోయినట్టుగా ఫీలవుతున్నాను... నాకు ప్రస్తుతం ఆ మూడ్‌లేదు... నన్ను వదిలెయ్... ప్లీజ్..." అన్నాడతడు తనకు అంటుకుపోయిన ఆమెను తన నుండి వేరుచేస్తూ...

"నీకా మూడ్ తెప్పిస్తాలే అన్వేష్... కొంచెం ఓపికపట్టు..." అందామె అతని మొఖం మీద ముద్దుల వర్షం కురిపిస్తూ...

"ప్లీజ్ అనూ! నన్ను వదిలెయ్... కాలు కదిపే శక్తి కూడా లేదు నాకిప్పుడు... నన్ను పడుకోనియ్... పిచ్చి నిద్రవస్తోంది..." అన్నాడతడు విసుగ్గా ఆమెను తనమీది నుండి తోసేస్తూ.

ఆమె "నాకై నేను కోరితే నాకు దూరంగా జరుగుతారా? ఛీఛీ!" అనుకుంటూ అతన్నుండి దూరంగా జరిగి మరోవైపు తిరిగి పడుకుంది.

కాస్సేపట్లోనే అతడు గాఢనిద్రలోకెళ్ళిపోయాడని అతని శ్వాసను బట్టి ఆమె అర్థం చేసుకుంది.

ఆమెకతని మీద జాలి కల్గింది. నిజంగానే అలసిపోయినట్టున్నాడు. పక్కనే నిండు యవ్వనంలో ఉన్న అందమైన భార్యను వదిలేసి అలా గాఢనిద్రలోకెళ్ళిపోవడం ఎంత దయనీయం! కావాలని అడిగినా అతడు తనను పట్టించుకోకపోవడం ఎంత అన్యాయం!

"టెర్రిబులీ టైర్డ్" అన్నాడు. ఆయన ప్రతిరాత్రీ ఇలా అలసిపోయే ఇంటికొస్తాడు.

అతనిది రాత్రి డ్యూటీ.

తనది పగలు డ్యూటీ.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అతడు ఓ పెద్ద ఐ.టీ. సంస్థలో పనిచేస్తున్నాడు.

అవుట్ సోర్సింగ్ పుణ్యమా అని అమెరికన్ కంపెనీల నుండి ఇండియన్ కంపెనీలకు బోల్డు అసైన్‌మెంట్స్ వస్తున్నాయి.

ఇంటర్నెట్ ద్వారా అమెరికన్ కంపెనీలు పంపించే అసైన్‌మెంట్స్‌ని అందుకొని వాటిని పూర్తిచేసి తిరిగి ఇంటర్నెట్ ద్వారానే అమెరికన్ కంపెనీలకు పంపించాలి. ఇవే అసైన్‌మెంట్స్‌ని అమెరికాలోనే పూర్తి చేయించుకోవాలంటే ఇక్కడికంటె పదిరెట్లు ఎక్కువ ఖర్చవుతుందిట. ఇంటర్నెట్ రావడంతో ప్రపంచంలో ఎక్కడ్నించి ఎక్కడికైనా ఎంత సమాచారాన్నైనా క్షణాల్లో పైసా ఖర్చు లేకుండా పంపించవచ్చు. ఓ అమెరికన్ కంపెనీవాడు తమ ఎకౌంట్స్‌ని ఇక్కడికి పంపించి వాళ్ళ బాలన్స్‌షీట్‌ని, ఇన్‌కమ్ అండ్ ఎక్స్‌పెండిఛర్ స్టేట్‌మెంట్‌ని తయారుచేసిపెట్టమని అడుగుతాడు. ఇక్కడి వాళ్ళు ఆ సమాచారాన్ని తీసుకొని దాని ఆధారంతో వాళ్ళడిగిన బాలన్స్‌షీట్‌ని, ఇన్‌కమ్ అండ్ ఎక్స్‌పెండిఛర్ స్టేట్‌మెంట్‌ని తయారుచేసి పంపిస్తారు. ఇందుకు అమెరికా కంపెనీవాళ్ళు ఇక్కడి కంపెనీవాళ్ళకు ఫీజును చెల్లిస్తారు. ఇదే పనిని అమెరికా కంపెనీల వాళ్ళు అమెరికాలోనే చేయించుకోవాలంటే ఇండియన్స్‌కు చెల్లించిన ఫీజుకంటె యే పదిరెట్లో ఎక్కువ ఫీజు చెల్లించవలసి వస్తుందట. ఇలా ఒక దేశస్థులు మరో దేశస్థులతో పని చేయించుకోవడాన్నే ఔట్‌సోర్సింగ్ అంటున్నారు. ఇంటర్నెట్ అనే సౌలభ్యం యేర్పడినప్పట్నించి ఈ అవుట్ సోర్సింగ్ అనేది

ప్రపంచమంతా వ్యాప్తిలోకొచ్చింది. ఈ ఔట్‌సోర్సింగ్ కారణంగా ఎక్కువగా లాభపడింది భారతీయులేనట. ఇక్కడి ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకూ చార్టర్డ్ ఎకౌంటెంట్స్‌కీ, ఇంకా ఎందరో కన్సల్టెన్సీ సర్వీసెస్ వాళ్ళకీ చేతినిండా పని, జేబులనిండా డబ్బూ దొరికాయి.

అమెరికా భూగోళానికి అవతలి పక్కనుంది.

అక్కడ పగలయితే మనకు రాత్రి.

అక్కడ రాత్రయితే మనకు పగలు.

ఇంటర్నెట్ ద్వారా వాళ్ళు పగలంతా మనకు అసైన్‌మెంట్స్‌ని పంపిస్తుంటారు. వాటినిక్కడ మనం రాత్రి రిసీవ్ చేసుకోవలసి ఉంటుంది. ఈ కారణం వల్లనే అవుట్ సోర్సింగ్ విభాగాల్లో పనిచేసే వాళ్ళందరికీ రాత్రి డ్యూటీలు పడ్తుంటాయి. అన్వేష్ క్కూడా ఔట్ సోర్సింగ్ కారణంగానే మంచి ఉద్యోగం దొరికింది. అతనికా ఉద్యోగం దొరికాకే అతనికీ, తనకూ పెళ్ళయింది.

పెళ్ళయ్యేనాటికే అనుపమ ఉద్యోగం చేస్తోంది. హోటల్ మేనేజిమెంట్ కోర్సులో డిగ్రీ సంపాదించి ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో రిసెప్షనిస్టుగా చేరింది.

ఎప్పుడూ చేతినిండా పనుండే ఉద్యోగం ఆమెది. రోజంతా నిల్చొనే ఉండాలి. బోల్డు ఫోన్‌కాల్స్ రిసీవ్ చేసుకోవాలి. వాళ్ళడిగిన ఎన్నో ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పాలి. హోటల్‌కొచ్చే కస్టమర్లతో చాలా మర్యాదగా మాట్లాడాలి. ఎప్పుడూ ముఖం మీద చిరునవ్వును అంటించుకోవాలి. కనిపించిన వాళ్ళందర్నీ 'హాయ్!' అంటూ పలకరించాలి. ఉదయం ఎనిమిదింటికి వెళ్తే మళ్ళీ ఇంటికొచ్చేటప్పటికి రాత్రి ఎనిమిదవుతుంది. తను ఇంటినుండి వెళ్తున్నప్పుడు అన్వేష్ నిద్రలో ఉంటాడు. తను ఇంటికొచ్చేటప్పటికి అన్వేష్ ఆఫీసుకు వెళ్ళిపోతాడు.

పెళ్ళయిన రెండు సంవత్సరాల్లోనే సిటీలోని హిమాయత్‌నగర్ లాంటి బిజీ సెంటర్లో 30 లక్షలు పెట్టి ఒక అపార్ట్‌మెంట్ కొనుక్కున్నారు. ఆ అపార్ట్‌మెంట్‌లోకెళ్ళాక మరో ఐదు లక్షలు ఖర్చుచేసి కప్‌బోర్డ్సుకు షట్టర్స్, సోఫాసెట్, ఇంటీరియర్ డెకరేషన్ లాంటి హంగుల్ని సమకూర్చుకున్నారు.

ఆ తర్వాత మరో ఆరు లక్షలు ఖర్చుచేసి చెరో కారు కొన్నుకున్నారు. ఇంత డబ్బునూ వాళ్ళు బ్యాంకుల నుండి రుణాల రూపంలోనే సేకరించుకోగల్గారు. వాళ్ళకొచ్చే జీతాల్లో సగానికంటె ఎక్కువ భాగం ప్రతినెలా ఈ అప్పుల్ని తీర్చడానికి చెల్లించే ఇన్‌స్టాల్‌మెంట్స్ రూపంలోనే ఖర్చయిపోతుంటాయి. పాతికేళ్ళు పూర్తయితే తప్ప ఈ

రుణాల నుండి తమకు విముక్తి లభించే అవకాశం లేదు. ఈ రుణాలు తీరేంత వరకు తామిద్దరూ ఈ ఉద్యోగాలు చెయ్యాల్సిందే.

అందమైన ఇల్లు, ఆ ఇంట్లో ఉండాల్సిన ఏసీ, ఫ్రిజ్, హోమ్ థియేటర్, కాస్ట్లీ ఫర్నిఛర్ మొదలైన సౌకర్యాలన్నీ ఉన్నాయి. కానీ వాటిని అనుభవించే తీరిక గానీ, ఓపిక గానీ తమకు లభించటం లేదు.

దీర్ఘంగా నిట్టూరుస్తూ అనుపమ పక్కమీంచి లేచింది.

అప్పుడే చీకట్లు విచ్చుకుంటూ తెలతెలవారుతోంది. గోడమీదున్న గడియారం ఆరుగంటలయిందని చెబుతోంది.

పదకొండయితే గాని అన్వేష్ నిద్రలేవడు.

అనుపమ మెల్లగా నడుచుకుంటూ వెళ్ళి బయటి డోర్స్ తెరచింది. బయట పడిఉన్న పాల పాకెట్లనూ, న్యూస్ పేపర్లనీ తీసుకొని లోపలకొచ్చి తలుపుల్ని మూసేసింది.

ఒక తెలుగు, ఒక ఇంగ్లీషు న్యూస్ పేపర్ని తెప్పిస్తారు. కానీ వాటిని తెరచి కనీసం హెడ్‌లైన్స్‌ని చదివేటంత తీరిక కూడా తమకు లభించటం లేదు. న్యూస్ పేపర్సే కాకుండా అన్వేష్ 'ఇండియా టుడే' 'అవుట్‌లుక్' లాంటి న్యూస్ మ్యాగజైన్స్ కూడా తెప్పిస్తాడు. వాటిని కూడా ఓసారి తిరగేయడానికి అతనికి టైమ్ దొరకడం లేదు.

అనుపమ హాల్లో ఉన్న వాష్‌బేసిన్ దగ్గరకెళ్ళి బ్రష్ చేసుకుంది. తర్వాత వంటగదిలోకెళ్ళి స్టౌ వెలిగించి కాఫీ చేసుకుంది. కాఫీ సిప్‌చేస్తూ టీ.వీ ఆన్‌చేసి కాస్సేపు వార్తల్ని చూసింది. అన్వేష్‌కు కాఫీ అంటే ఇష్టం ఉండదు. ఆయనకు టీయే మధురం. తనకు కాఫీ తప్ప టీ పడదు.

కాఫీ సిప్ చెయ్యడం ముగించి ఆమె త్వరత్వరగా వంటచెయ్యడం మొదలుపెట్టింది.

ఉప్మా చేసి తను కొంచెం తినేసి మిగతాది అతనికోసం కేసరోల్‌లో పెట్టింది. అన్వేష్ పదకొండింటికి లేచి బ్రష్ చేసుకొని ఈ ఉప్మా తింటాడు. తర్వాత తనే టీ చేసుకొని, న్యూస్ పేపర్ తిరగేస్తూ తాగేస్తాడు. తర్వాత కొన్ని ఫోన్‌కాల్స్‌తో గడుపుతాడు. ఆ తర్వాత షేవ్ చేసుకొని స్నానం చేస్తాడు. ఆ తర్వాత ల్యాప్‌టాప్ ముందేసుకొని రాత్రి చేసిన పనిసంతా ఒకసారి సమీక్షించుకుంటాడు. ఈలోగా ఒకటిన్నరో రెండో అవుతుంది. రైస్ కుక్కర్ స్టౌమీద పెట్టుకొని అన్నం వండుకుంటాడు. నిన్న తను

వండిన కూరలు ఫ్రిజ్‌లో ఉన్నాయి. వాటిని మైక్రోవోవెన్‌లో కాస్సేపు పెట్టుకొని అవి వేడయ్యాక అన్నంలో కలుపుకుని తినేసి భోజనం ముగిస్తాడు. భోజనం చేశాక మళ్ళీ కాస్సేపు ల్యాప్‌టాప్ ముందేసుకొని కూర్చుంటాడు. తర్వాత బెడ్‌మీద పడుకొని ఓ కునుకు తీస్తాడు. లేచేటప్పటికి ఆఫీసుకు టైమవుతుంది. డ్రెస్ చేసుకొని ల్యాప్‌టాప్ భుజాన వేసుకొని ఇంటికి లాక్‌చేసి కింద పార్కింగ్‌ప్లేస్‌లో ఉన్న తన కారును బయటకు తీస్తాడు. ఇంటి నుండి ఆఫీసు చేరుకోవడానికి కనీసం రెండుగంటలైనా పడ్తుంది. ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కుంటే అంతకంటే ఎక్కువే పట్టొచ్చు. రాత్రి ఎనిమిదింటివరకు ఆఫీసు చేరుకొని రాత్రంతా కంప్యూటర్ ముందుకూర్చొని పనిచేస్తూనే ఉంటాడు. మధ్యలో యేదన్నా ఫాస్ట్‌ఫుడ్ తెప్పించుకొని తింటాడు. అదే ఆయన రాత్రి భోజనం. తెలతెలవారుతుండగా బాగా అలసిపోయి ఇంటికొస్తాడు. రాగానే బెడ్‌మీద వాలిపోయి గాఢనిద్రలో కెళ్ళిపోతాడు.

తనేమొ ఉదయం ఎనిమిదింటికల్లా తయారై తను పనిచేస్తున్న హోటల్‌కెళ్ళాలి. హోటళ్ళో అడుగుపెట్టిన క్షణం నుండి మళ్ళీ రాత్రి ఎనిమిదింటికి ఇంటికొచ్చే వరకు క్షణం తీరికుండదు. ఈ పన్నెండు గంటలూ నిల్చొనే ఉండాలి. వచ్చీపోయే కస్టమర్లను రిసీవ్ చేసుకోవడం, బై చెప్పడం... వచ్చేవాళ్ళను వాళ్ళకు రిజర్వ్ చెయ్యబడిన రూమ్స్‌కు పంపించడం... వెళ్ళేవాళ్ళకు చిరునవ్వుతో థాంక్స్ చెప్పడం... ఎన్నో ఫోన్‌కాల్స్‌ని రిసీవ్ చేసుకోవడం... రూమ్స్ అవేలబిలిటీని గూర్చి చెప్పడం... ఫోన్ చేస్తున్న వాళ్ళతో అత్యంత మర్యాదగా మాట్లాడటం, వాళ్ళడిగిన సమాచారన్నంతా విసుక్కోకుండా అందివ్వటం... కొందరు కావాలని తనతో ఎక్కువసేపు మాట్లాడిస్తారు... అతి చనువు చూపించబోతారు... ఎంత అలసిపోయినా అలసిపోయినట్టుగా కనిపించకుండా జాగ్రత్త పడాలి... లోపల ఎంత బాధ ఉన్నా పైకిమాత్రం ఎవర్ని చూసినా 'హాయ్' అంటూ చిరునవ్వు చిందించాలి... అతి చనువు చూపించేవాళ్ళతో కూడా తనూ చనువుగానే ఉన్నట్టు నటించాలి. తన అందాన్ని చూసే వాళ్ళు అలా వెకిలిచేష్టలు చేస్తున్నారని అర్థం చేసుకోవాలి. ఈమె ఎంత అందంగా నవ్వుతుందో... ఎంత ప్రశాంతంగా మాట్లాడుతుందో... ఈమెకసలు విసుగు, కోపం అనేది ఎప్పుడైనా వస్తాయా? అని తన చుట్టూ ఉన్న జనం అనుకుంటారు. తన లోపల చెలరేగుతున్న అసంతృప్తి, అశాంతిల గురించి వీళ్ళకేం తెలుసు అనుకుంటుంది తను.

ఇలా ఆలోచిస్తూనే అనుపమ తన పనులన్నీ చకాచకా ముగించేసుకుంది. వంట చెయ్యడం, స్నానం చెయ్యడం, డ్రెస్ చేసుకోవడం, రెండు ముద్దలు నోట్లో

వేసుకోవడం, వంటగదిని సర్దేసెయ్యడం మొదలైన పనులన్నింటినీ ముగించుకొని బెడ్‌రూంలో పడుకొని నిద్రపోతున్న అన్వేష్ దగ్గరకొచ్చింది. అతన్ని తట్టిలేపుతూ

"నే వెళ్తున్నాను అన్వేష్" అంది అనుపమ.

"వెళ్ళు" అన్నాడతడు విసుగ్గా... నిద్రను పాడుచేశావన్న కోపం కనిపించిందతనిలో..

"రాత్రి నువ్వు కీ మరచిపోయావు... దాన్ని ఫ్రిడ్జ్ మీద పెట్టాను... ఈరోజు తీసికెళ్ళు... రాత్రి ఇంటికి తాళం వెయ్యకుండానే వెళ్ళిపోయావు... ఈరోజు అలా చెయ్యకు... తలుపులన్నీ మూసేసి బయటి డోర్‌కు తాళం వేసి వెళ్ళు..." అంది అనుపమ.

"అలాగేలే... నువ్వెళ్ళు... నన్నిలా కాస్సేపు పడుకోనీయ్" అన్నాడతడు ఇంకా విసుగ్గా.

"ఉప్మా చేసి కేసరోల్‌లో పెట్టాను... బ్రష్ చేసుకోగానే తినేసెయ్... లేకపోతే చల్లారిపోతుంది" అంది అనుపమ.

"అలాగేలే తల్లీ! నన్నిలా వదిలేసి నువ్వెళ్ళిపో..." అన్నాడతడు ఈసారింకా విసుగ్గా.

"వదిలెయ్యక చేసేదేముంది మహాశయా!... నన్ను నువ్వు, నిన్ను నేను ఇలా వదిలేసుకుంటూనే బతుకుతున్నాం..." నిర్వేదంగా అంటూ ఆమె బెడ్‌రూంలోంచి బయటకొచ్చింది. తన దగ్గరున్న తాళపుచెవితో బయటి డోర్‌కులాక్ చేసి కిందకు వెళ్ళటానికి లిఫ్ట్ దగ్గరకొచ్చింది.

నాల్గో అంతస్తులో ఉంటున్న ఆమె లిఫ్ట్‌లో కిందకొచ్చి కార్ పార్కింగ్‌ప్లేస్‌లో ఉన్న తన కారును బయటకు తీసి తను పనిచేస్తున్న హోటల్‌కు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయింది.

* * *

వారం రోజులు గడిచిపోయాయి.

ఆరోజు ఆదివారం కావడం వల్ల అతని ఆఫీసుకు సెలవు. కానీ ఆమెకు సెలవు లేదు. ఆమెకు బుధవారం సెలవు.

అతడా రోజంతా ఇంట్లోనే ఉండి చాలాసేపు నిద్రపోయాడు. కాస్సేపు ఐదారు రోజుల పేపర్లని తిరిగేశాడు. టీ.వీలో "జీ స్టూడియో" ఛానెల్లో వస్తున్న ఓ ఇంగ్లీషు సినిమా చూశాడు. ఆ సినిమాలో చాలారోజుల ఎడబాటు తర్వాత ప్రేయసీ

ప్రియులు ఓ అందమైన ప్రదేశంలో కలుసుకుంటారు. అప్పుడు వాళ్ళు అనుభవించిన ఆనందం అంతా ఇంతా కాదు... వాళ్ళు ఒకరితో ఒకరు ఐక్యమైపోతూ జరిపిన ప్రేమ కలాపాలను దర్శకుడు చాలా అద్భుతంగా చిత్రీకరించాడు. వాళ్ళ లవ్ మేకింగ్ దృశ్యాలను చూస్తోంటే అతని రక్తం వేడెక్కింది. వెంటనే అనుపమ వస్తే బావుండుననిపించింది. అనుపమా తనూ అలా కలుసుకొని ఎంతకాలమైపోయిందో... ఒకింట్లో ఉంటున్నారన్న మాటేగానీ ఇద్దరిమధ్య ఎంత దూరమో! ఈరోజు దూరాన్ని జయించి ఇద్దరూ ఒక్కరైపోవాలి... ఆమెతో ఐక్యమైపోతున్నట్టు అతడు కలలుగనడం మొదలెట్టాడు.

రాత్రి తొమ్మిదవుతుండగా అనుపమ ఇంటికొచ్చింది...

"ఈరోజింత ఆలస్యమైపోయిందేమిటి అనూ!" అన్నాడతడు ఆమెకు ఎదురుగా వెళ్ళి, ఆమె చేతిలో చేయి కలిపి.

చేతిలో ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను సోఫామీదకు విసిరేసి ఆమె చక్కగా బెడ్‌రూంలోకెళ్ళిపోయి విసురుగా బెడ్‌మీద పడిపోయింది.

"యేమైంది అనూ?" అన్నాడతడు ఆమెకు జ్వరంగానీ రాలేదుకదా అని ఆమె నుదుటిమీద చెయ్యేసి.

"యేమీ కాలేదు... ఈరోజు నాతోపాటు పనిచేసే ఇంకో రిసెప్షనిస్టు రాలేదు... ఇద్దరి పని నేనొక్కదాన్నే చేశాను... ప్రాణాలు తోడేశారనుకో... నాకు లేచి బట్టలు మార్చుకునే శక్తికూడా లేదు... నన్నిలా పడుకోనీయండి... ప్లీజ్...." అందామె దిండులో ముఖాన్ని దాచేసుకొని.

"యేమీ తినకుండానే పడుకుంటావా? నేను వంట చేశాను... ఇద్దరం కాస్త తిని..."

"ప్లీజ్ అన్వేష్.. నాకు తినే ఓపిక కూడా లేదు... నేను పడుకోవాలి... నిద్ర ముంచుకొస్తోంది... నన్నిలా వదిలెయ్ అన్వేష్... నా కాళ్ళూ చేతులూ జివ్వుమని విపరీతంగా లాగుతున్నాయి.... నాల్గైదు గంటలు కంటినిండా నిద్రపోతే తప్ప నేను మామూలు మనిషిని కాలేను. ప్లీజ్!" అందామె బతిమాలుతున్నట్టుగా.

"అనూ... ఈరోజు నేనెంతో ఆశగా నువ్వెప్పుడొస్తావా అని ఎదురుచూస్తున్నాను... ఈరోజు నీతో హాయిగా గడపాలని కలలుగంటున్నాను... నువ్వొచ్చి ఇలా పడుకోవటమేమిటి... నువ్వు లేచి బట్టలు మార్చుకొని, స్నానం చేసి భోజనం చేసి... బెడ్‌మీదకు చేరి..."

తన మాటలు ఆమె వినడం లేదని అతనికర్థమైంది.

ఆమె గాఢనిద్రలో కెళ్ళిపోయిందని ఆమె శ్వాసనుబట్టి అతడు తెలుసుకున్నాడు. ఆమెను బలవంతంగా లేపైనా సరే ఆమెతో తన కోరికను తీర్చుకోవాలనుకున్నాడు. కానీ మరుక్షణంలోనే అతని హృదయం ఆమెమీది జాలితో నిండిపోయింది.

పాపం... ఎంత అలసిపోయి ఇంటికొచ్చిందో... ఆమె నిద్రను భంగం చేసే పాపానికి తను పాల్పడకూడదు. ఎంతో అలసిపోతే తప్ప ఆమె ఇలా బెడ్‌మీదకు చేరిపోయిన మరుక్షణంలోనే నిద్రలో కెళ్ళిపోదు... గాఢంగా నిట్టూర్చి, ఆమె పక్కనే పడుకొని అతడూ నిద్రపోవడానికి ప్రయత్నించాడు.

కానీ అతనికి చాలాసేపటిదాకా నిద్ర రాలేదు. ఆలోచిస్తోంటే అతనిమీద అతనికే జాలి కల్గింది.

'నవ్య' వారపత్రిక *(21-5-2008)*